క్లుప్తంగా

మూలకి చేరిన చెత్త డబ్బాలు



పొన్నూరు: మున్సిపల్ అధికారుల అలసత్వం కారణంగా 'స్వచ్ఛ పొన్నూరు' అనుకున్న లక్ష్యాన్ని సాధించలేక పోయింది. మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డుల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేసేందుకు సమకూర్చిన చెత్త డబ్బాలు మున్సిపల్ కార్యాలయంలో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రతి ఇంటికీ చెత్త డబ్బాలను అందజేయాలన్న లక్ష్యం నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా నిరుపయోగంగా ఉన్న చెత్త డబ్బాలను పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అలరించిన భక్తి గీతాలాపన



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం సాయంత్రం మధురవళి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు రాధామైథిలి శిష్య బృందం కృష్ణ చంద్రిక, వరలక్ష్మి, సుజాత, తస్వీశ్రీ తమ గాత్రధారణలో పలు అన్నమయ్య సంకీర్తనలు, భక్తి గీతాలను ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. కీబోర్డుపై జి.సాయి, తబలపై పి.వి.రమణ వాయిద్య సహకారాన్ని అందించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో వసంత నవరాత్రుల సందర్భంగా సప్తమి శుక్రవారం చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది మంది వేద పండితుల ఆధ్వర్యంలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీ గణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నృసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అంకురార్పణ, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచన, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, మంగళాశాసనం నిర్వహించారు. నగర పరిసరాల్లోని భక్తులు పెద్దసంఖ్యలో హాజరై, ప్రారంభ బ్రహ్మోత్సవాలను తిలకించారు. స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈనెల 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఈఓ ఎస్.ఆంజనేయాచార్యులు తెలిపారు.

కూల్ డ్రింక్స్ ఫ్యాక్టరీ తనిఖీ



గుంటూరు రూరల్ : నగరానికి సమీపంలోని మల్లవరంలో కూల్ డ్రింక్స్ తయారు చేస్తున్న ఫ్యాక్టరీని గుంటూరు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ చదలవాడ హరిబాబు, బీరాల నాగేశ్వరరావు, గాయకోటి బేబీ సరోజిని, మునిపల్లె కవిత, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌తో శుక్రవారం తనిఖీ చేశారు. ఇందులో పలు విషయాలు వెలుగులోకి చూశాయి. ఫ్యాక్టరీ యజమాని నిబంధనలకు విరుద్ధంగా రసాయనాలు, రంగులు, సాక్రిన్‌తో కూల్ డ్రింక్ తయారు చేయడంపై అధికారులు ప్రశ్నించారు. అయితే, పల్ప్ తో చేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉంది. ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ కేసు నమోదు చేశారు. కమిటీ సభ్యులు మొత్తం ఫ్యాక్టరీని సందర్శించారు. గుంటూరు ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారి నూతలపాటి పూర్ణచంద్రరావుకు సమాచారం ఇచ్చారు. ఫ్యాక్టరీ నడుపుతున్న ఆర్వో ప్లాంట్ నీరు సేకరించి మైక్రో బయాలజీ, కెమికల్ ఎనాలసిస్ పంపాలని సూచించారు. చిన్న పిల్లల ఆరోగ్యానికి హాని చేసే డ్రింక్స్ శాంపిల్స్ను టెస్టింగ్‌కు పంపినట్లు చెప్పారు.

డ్వాక్రా మహిళల సొమ్ము స్వాహా

- సొంతానికి వాడుకున్న యానిమేటర్
- కొత్త రుణం కోసం బ్యాంక్‌కు వెళితే బండారం బట్టబయలు
- పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన డ్వాక్రా మహిళలు



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు

కాకుమాను: డ్వాక్రా మహిళల సొమ్మును నెల నెలా బ్యాంక్ ఖాతాల్లో భద్రపరచి వారికి అవసరమైన సమయంలో విత్‌డ్రా చేసి వారి ఉపయోగాలకు అవసరమయ్యే విధంగా చేయడం యానిమేటర్ల విధి. ఇందుకు విరుద్ధంగా కాకుమాను మండలంలోని గరికపాడు శ్రీ సూర్యనారాయణ గ్రూపు యానిమేటర్ మాత్రం స్వాహా చేసింది. గ్రూపు సభ్యులు వివిధ వ్యవసాయ పనుల నిమిత్తం వేరే గ్రామాలకు వెళ్తుంటారు.ఈ నేపథ్యంలో యానిమేటర్ అయిన శ్యామలకు గత 30 నెలల నుంచి పలువురు సభ్యులు ఫోన్‌పే ద్వారా, మరికొందరు నగదు రూపేణా అందజేశారు. కట్టడం పూర్తవ్వడంతో సభ్యులు కొత్త రుణం కోసం బ్యాంకును ఆశ్రయించారు. గత 30 నెలల నుంచి గ్రూపు సభ్యులు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు అంటూ బ్యాంక్ అధికారులు సమాధానం ఇవ్వడంతో యానిమేటర్‌ను నిలదీశారు. దీంతో అసలు విషయం బట్టబయలైంది. గత కొన్ని నెలల నుంచి సభ్యుల నగదు బ్యాంక్‌లో జమచేయలేదని, వ్యక్తిగత అవసరాలను ఉపయోగించుకున్నానని సమాధానం చెప్పడం విశేషం. దీనిపై సభ్యులు యానిమేటర్‌ను నిలదీశారు. తనకు మరణం తప్పా వేరే మార్గం లేదని, కొంత సమయం ఇస్తే విడతల వారీగా నగదు తిరిగి ఇస్తానని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చింది. దీంతో గ్రూపు సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం యానిమేటర్‌పై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా వెలుగు సీసీ సుబ్బారావు సైతం పది రోజుల్లో సభ్యులు నగదు అందజేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు



పీఎండీఎస్ కిట్లను రైతులకు అందజేస్తున్న అధికారులు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతంతో పాటు రైతులకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక, పీఎండీఎస్ కిట్లపై కొల్లిపర మండలస్థాయి అవగాహన, సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి రైతుకీ ప్రకృతి వ్యవసాయంపై అధికారులు అవగాహన కల్పించి, 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. పంట అవశేషాలను ఆచ్ఛాదనగా ఉపయోగించాలని సూచించారు. ఈ పద్ధతి ద్వారా భూమిలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, సారవంతంగా తయారవుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పూర్తి స్థాయిలో జరగాలంటే అందరి సహకారంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. పీఎండీఎస్ వేద్దాం.. రసాయన ఎరువులు తగ్గిద్దాం అనే నినాదాన్ని రైతుల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తెనాలి డివిజన్ ఏడీఏ ఉషారాణి మాట్లాడుతూ రసాయన మందుల వినియోగం తగ్గించి, ఘన, ద్రవ జీవామృతాలను వినియోగించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ జీవన ఎరువులు రైతుల అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో రైతులు ప్రకృతి వ్యవసాయ అనుభవాలను తెలియజేశారు. రైతు అరిమండ మణిదీప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా జామ పంటలో తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సాధిస్తున్నానని తెలిపారు. రైతు బాపన్న మాట్లాడుతూ రైతు సాధికార సంస్థ అధిక ధరతో మార్కెటింగ్ సదుపాయాలను అత్తోటలోని భూమి భారతి ద్వారా కల్పిస్తుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ చేస్తున్న ఆదర్శ రైతులను డీఏఓ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది , మండల సమాఖ్య ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు, ఆత్మా సిబ్బంది, ఆదర్శ రైతులు, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కేరళలోనూ ప్రకృతి వ్యవసాయం ప్రారంభం

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన బృందం



కేరళ వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమైన ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు

గుంటూరు రూరల్: కేరళకు చెందిన వ్యవసాయ శాఖ బృందం గత రెండు రోజులుగా రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నగరంలోని రైతు సాధికార సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ రాష్ట్ర ప్రభుత్వ అగ్రికల్చర్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ వెంకటరామన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రైతులు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని తమ రాష్ట్రంలోని 64 క్షేత్రాల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు, ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ద్వారా అమలవుతున్న వ్యవసాయ క్షేత్రాలను రెండు రోజులపాటు పరిశీలించామని పేర్కొన్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయకుమార్ మాట్లాడుతూ కేరళలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ఆరంభంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని, కాలక్రమేణా వాటిని అధిగమించి మహిళా సంఘాల భాగస్వామ్యంతో విజయవంతంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. కేరళ అధికారులు, రైతులకు క్షేత్ర పర్యటనలో నెలకొన్న అనేక అనుమానాలను నివృత్తి చేసినట్లు చెప్పారు. డెప్యూటీ డైరెక్టర్ ఎన్. బాలునాయక్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రైతులకు రసాయన ఎరువులపై ఇచ్చే రాయితీ భారం కూడా ప్రభుత్వంపై తగ్గుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యానశాఖ అడిషనల్ డైరెక్టర్ సి.బి. హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ పండ్లు, ఆకుకూరలు, కూరగాయలలో పెరిగిపోయిన రసాయన అవశేషాలవల్ల కాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయని చెప్పారు. విదేశాలకు ఎగుమతి చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల్లో అధికంగా రసాయన అవశేషాలు ఉన్నట్లు తేలాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి. రామారావు, రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు డి.వి.రాయుడు, జి. మురళీధర్, గోపీచంద్, కృష్ణారావు, శ్రీనివాసరావు, హుమయూన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు వేజండ్ల టీచర్ ఎంపిక



విజయలక్ష్మి

వేజండ్ల(చేబ్రోలు): మండలంలోని వేజండ్ల జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయురాలు నూతలపాటి విజయలక్ష్మి అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు. సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌పీఎల్‌టీవో) సామాజిక సేవా రంగాల్లో కృషి చేసిన ప్రముఖులను అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డులకు ఎంపిక చేసింది. ఇందులో వేజండ్లకు చెందిన స్పెషల్ ఎడ్యుకేటర్ విజయలక్ష్మిని ఎంపిక చేసినట్లు ఎస్‌పీఎల్‌టీవో వ్యవస్థాపక అధ్యక్షులు పి. నాగయ్య తెలిపారు. దివ్యాంగులకు సేవతో పాటు వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో విజయలక్ష్మి కృషి చేశారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏప్రిల్ 13న జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె అవార్డును అందుకోనున్నారు.

పాఠశాలకు వాటర్ కూలర్, కంప్యూటర్ బహూకరణ



కొరిటెపాడు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం గుంటూరు వారి సౌజన్యంతో శుక్రవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాటర్ కూలర్, కంప్యూటర్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞాన ప్రసూన బ్యాంక్ మానవతా దృక్పథాన్ని ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రీజినల్ హెడ్ సయ్యద్ జవహర్ విద్యార్థుల్లో పొదుపు అలవాటును పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. బ్యాంకు ఖాతా తెరచిన విద్యార్థులను అభినందించారు. బ్యాంక్ అధికారులు తమ ప్రముఖ పథకం 'యూనియన్ ముస్కాన్' గురించి వివరించారు. ఇది 18 సంవత్సరాలలోపు పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బ్యాంక్ అధికారులు పొదుపు ఖాతాల పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ రీజినల్ హెడ్ ఎ. రాజేశ్, చీఫ్ మేనేజర్ శ్రీనివాస కుమార్ హరి, సీనియర్ మేనేజర్ హారిక హాజరయ్యారు.

చెరువులో నీటి తొలగింపుతో అనర్థాలు



మాట్లాడుతున్న సత్యనారాయణ తదితరులు

పెదకాకాని: స్థానిక పల్లాలమ్మ చెరువులో నీటిని బయటకు పెట్టకుండా నిలిపివేయాలని సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అధికారులను కోరారు. ప్రజాప్రతినిధుల అండదండలతో చేపలు పట్టుకునేందుకు మోటార్లతో నీటిని తోడుతున్నట్లు ఆరోపించారు. పల్లాలమ్మ చెరువులోని నీటిని అక్రమంగా బయటకు తరలించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పెదకాకాని మండల తహసీల్దార్ కృష్ణకాంత్, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ను కలసి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. పవిత్ర పుణ్య క్షేత్రాలకు నిలయమైన పెదకాకానిలో చెరువు నీరు బయటకు పెట్టడం ద్వారా భూగర్భ జలాలు ఇంకిపోతాయని, బోర్లకు నీరు అందకుండా వేసవిలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. గతంలో ఇదే చెరువుకు నిధులు ఖర్చు చేసి సమీపంలోని గుంటూరు చానల్ నుంచి నీళ్లు పెట్టినట్లు గుర్తు చేశారు. అనంతరం మోటార్ల ద్వారా చెరువు నీటిని బయటకు పెడుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నేతలు కేతినేని అగస్టీన్, రామిశెట్టి శ్రీనివాసరావు, బొట్టు శ్రీనివాసరావు, రెంటాల కుమారి పాల్గొన్నారు.

సినిమా ఫక్కీలో సెల్‌ఫోన్ చోరీ



బండి లేపుతున్నట్లు నటిస్తూ సెల్‌ఫోన్ చోరీ చేసిన యువకుడు

గుంటూరు రూరల్: ఒంటరిగా వ్యక్తి వెళుతున్నాడని గమనించిన దుండగులు బండి పడిపోయినట్లు నటించి సెల్‌ఫోన్ చోరీ చేసిన సంఘటన ఏటుకూరులో సీసీ కెమెరాల ద్వారా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కృష్ణ బైక్‌పై ఇంటికి వెళుతున్నాడు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు ఆయన్ను మరో బైక్‌పై వెంబడించారు. కృష్ణ తన ఇంటి సమీపంలో రోడ్డుపై బండిని నిలుపుతుండగా, వెనుక కూర్చున్న వ్యక్తి కూడా కొంత దూరంలో బండి దిగాడు. మరోవ్యక్తి వాహనాన్ని కృష్ణ నివాసం సమీపంలోకి వచ్చి వెనక్కు తిప్పుతున్నట్లు నటిస్తూ దాన్ని పడేశాడు. అనంతరం బండి పడిందని లేపాలని కేకలు వేశాడు. దీంతో పక్కనే కృష్ణ దాన్ని లేపే ప్రయత్నం చేస్తుండగా, సమీపంలో బండి దిగిన వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చాడు. వారితో బండి లేపేందుకు ప్రయత్నిస్తూ కృష్ణ జేబులోని సెల్‌ఫోన్‌ను కొట్టేశాడు. అనంతరం ఇద్దరు దుండగులు ఒకే బండిపై వెళ్లిపోయారు. కృష్ణ తేరుకునేలోపే పరారయ్యారు. జేబులోని సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గమనించి దుండగులను పట్టుకునేందుకు పరిగెత్తినా ఫలితం లేకపోయింది. ఈ మేరకు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ముఠా కార్మికులకు పని భద్రత కల్పించాలి

లక్ష్మీపురం: ఐరన్ షాపుల్లో పని చేస్తున్న ముఠా కార్మికులకు పని భద్రత కల్పించి, కూలి రేట్లు పెంచాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. కార్మికుల చేపట్టిన సమ్మె శుక్రవారంతో నాలుగో రోజుకు చేరిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. గత అనేక సంవత్సరాలుగా ఐరన్ షాపుల్లో పనిచేస్తూ ఎండనక వాననక నిత్యం శ్రమ చేస్తున్న ముఠా కార్మికుల అగ్రిమెంట్ కాల పరిమితి ముగిసిందని తెలిపారు. నూతన అగ్రిమెంటు చేయడంలో యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని, లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. దేశంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుకూలంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఐరన్ ముఠా మేస్త్రీలు పప్పుల రోసిరెడ్డి, కొంగలి కోటయ్య, బిచ్చాల కొండ, ఉప్పలపాటి శ్రీను, సత్యం, ఖాజావలి, శ్రీహరి, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

'సోమేపల్లి' జీవితం ఆదర్శనీయం



విజయలక్ష్మిని సత్కరిస్తున్న కాసింబీ, సుభాని, రాజేంద్రప్రసాద్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజ హితం కోసం పాటుపడిన సోమేపల్లి వెంకట సుబ్బయ్య జీవితం వర్తమాన, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా రచయితల సంఘ ఉపాధ్యక్షురాలు, రచయిత్రి షేక్ కాసింబీ పేర్కొన్నారు. ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సోమేపల్లి ప్రథమ వర్ధంతి సభను విజయపురి కాలనీలోని ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య మరణానంతరం నేత్రాలు శంకర నేత్రాలయానికి, పార్థివదేహాన్ని గుంటూరు మెడికల్ కళాశాలకు అందించిన నేపథ్యంలో ఆయన సతీమణి విజయలక్ష్మిని సత్కరించారు. ఈ సందర్భంగా కాసింబీ మాట్లాడుతూ వెంకట సుబ్బయ్య ఆర్డీవోగా, పులిచింతల ప్రాజెక్టు అధికారిగా నిలువెత్తు నిజాయతీకి నిదర్శనంగా పని చేశారని తెలిపారు. జిల్లా రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం సుభాని మాట్లాడుతూ రక్తదానానికి మనుషులు లోటు అని, రక్త దాహానికైతే కోటానుకోట్ల మంది అని సోమేపల్లి ఆవేదనగా చెప్పేవారని గుర్తు చేశారు. అవయవ, దేహ దాన ప్రచారోద్యమ నాయకుడు వల్లూరి సదాశివరావు మాట్లాడుతూ ఆగస్టు 13ను జాతీయ అవయవ దాన దినోత్సవంగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, 2025 సంవత్సరాన్ని 'రైజింగ్ అవేర్నెస్ అండ్ ఎంకరేజింగ్ ఆర్గాన్ డొనేషన్'గా నిర్ణయించిందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్, చావా శివాజీ, తోటకూర సౌభాగ్యమ్మ, మానుకొండ పద్మావతి, సోమేపల్లి శ్రీ వశిష్ట, జి. గురవయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో రైతులు, ప్రజలకు సమాచారహక్కు చట్టంపై శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం- 2005 ద్వారా పౌరులకు ప్రభుత్వ అధికారుల వద్ద ఉన్న సమాచారాన్ని పొందే హక్కు లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వంలో అవినీతిని తగ్గించి అధికారుల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు తోడ్పడుతుందని చెప్పారు. చట్టంపై సచివాలయ సిబ్బందితో పాటు రైతులు, ప్రజలు కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. రైతుల రిజిస్ట్రేషన్, వ్యవసాయ యాంత్రీకరణ తదితర పథకాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె లక్ష్మి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ప్రతినిధులు

పెదకాకాని: అధికారులు గ్రామసభలను రాజ్యాంగం, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సక్రమంగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్షుడు ఇల్లా చంద్రశేఖర్ కోరారు. పెదకాకానిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామసభలు ముఖ్యమైన భాగమని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా ఉండాలని కోరారు. రానున్న రోజుల్లో ప్రతి నెలా నిర్వహించే సభల్లో గ్రామస్తులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ సమావేశాల్లో పాల్గొనడం ద్వారా గ్రామంలోని అభివృద్ధి పనులపై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజలు పాల్గొనేలా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ప్రోత్సహించాలని తెలిపారు. పారదర్శకత, సమగ్రత, సమానత్వాన్ని పాటిస్తూ గ్రామసభలను నిర్వహించాలని ఆయన సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉన్నం భాస్కరరావు, మురికిపూడి చంద్రశేఖర్, నరకుళ్లపాటి అంకమ్మరావు పాల్గొన్నారు.

వీవీఐటీయూలో '23' చిత్ర బృందం సందడి



మాట్లాడుతున్న హీరో తేజ రాయపాటి

పెదకాకాని: యువ నటుడు తేజ రాయపాటి, తన్మయి ప్రధాన పాత్రల్లో మల్లేశం ఫేమ్ రాజ్ రాచకొండ దర్శకత్వంలో స్టూడియో 99, స్పిరిట్ మీడియా పతాకంపై నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందించిన చిత్రం '23' త్వరలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం వీవీఐటీ విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ రాజ్ రాచకొండ మాట్లాడుతూ తెలిసీ తెలియక జీవితంలో చేసే చిన్న చిన్న తప్పులు పెద్ద నేరాలుగా మారుతాయని తెలిపారు. వాటిని సరిదిద్దుకునే విధానం, తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా ఉన్నతంగా ఎలా జీవించాలనే సందేశాన్ని ఈ చిత్రం అందిస్తుందని తెలిపారు. హీరో తేజ మాట్లడుతూ ఈ చిత్రం సోషల్ మెసేజ్‌తో పాటు స్నేహం, ప్రేమ అంశాలపై రూపొందించామని, అందరూ చిత్రాన్ని చూసి ఆదరించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలసి గీతాలాపన, నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాయపాటి మమత, యాంకర్ దీప్తి నల్లమోతు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన



చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేస్తున్న ఎంఈఓ

కొమ్మూరు(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందిస్తున్నట్లు ఎంఈఓ కె.ఎఫ్. కెనడీ తెలిపారు. మండలంలోని కొమ్మూరు అంగన్‌వాడీ కేంద్రంలో విద్యను ముగించుకున్న పలువురు చిన్నారులను శుక్రవారం ఆయన గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యనభ్యశించే చిన్నారుల వివరాలను ప్రతి ఉపాధ్యాయుడు నమోదు చేసుకుని, వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని తెలిపారు. అమలవుతున్న పథకాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో అందిస్తున్న నాణ్యమైన విద్య గురించి తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం త్వరలో జరగనున్న పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ఎంఈఓ కెనడీ పెన్నులు, ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి, భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆయన తెలిపారు.

ఫార్మసీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరానికి స్పందన



విద్యార్థినికి వైద్య పరీక్షలు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నగరంలోని ఐశ్వర్య డెంటల్ క్లినిక్, ఇంప్లాంట్ సెంటర్ డాక్టర్ పి. ఐశ్వర్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆరోగ్య భద్రతలో దంతాలు ప్రథమ పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దంత ఆరోగ్యంపై అవగాహన, ఉచిత దంత పరీక్షలు, చికిత్స, సలహాలు, పరిశుభ్రత ప్రాముఖ్యత, విద్యార్థుల సామాజిక బాధ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి చిన్న చికిత్సలు, మందులతో పాటు భవిష్యత్తులో అవసరమైన జాగ్రత్తల గురించి సలహాలు అందించారు. దంత సంరక్షణతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ఆరోగ్యానికి ముఖ్యమని తెలిపారు. శిబిరంలో 250 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.